


ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ వలంటీర్ల తొలగింపులు, రాజీనామాలు పెరిగిపోతున్నాయి. వైసీపీ నేతలతో అంటకాగి ప్రచారంలో పాల్గొంటున్న కారణంగా జిల్లాలో సుమారు 50మందికిపైగా వలంటీర్లను విధుల నుంచి అధికారులు తొలగించారు. అయినా వారిలో మార్పు కనిపించడం లేదు. దీనికితోడు 'డబుల్ జీతమిస్తాం.. ఉద్యోగం మానేయండి' అంటూ వలంటీర్లను వైసీపీ నాయకులు ప్రోత్సహిస్తున్నారు. 'మళ్లీ అధికారంలోకి మేమే వస్తాం.. మీ ఉద్యోగాలు మీకిస్తాం' అంటూ ప్రలోభ పెడుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

వలంటీర్లకు 'వైసీపీ' వల

- ఉద్యోగం మానేయండి.. డబుల్ జీతమిస్తామంటున్న నాయకులు
- పెరిగిపోతున్న తొలగింపులు, రాజీనామాలు

గుడిపాల మండలం రామభద్రాపురానికి చెందిన రోహిత్ అనే వలంటీర్ వైసీపీ అభ్యర్థి విజయానంద రెడ్డి వెంట ప్రచారంలో పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో వలంటీర్‌ని విధుల నుంచి కలెక్టర్ తొలగించారు. ఇదిలా ఉంటే.. 'నెలకు రూ.10వేల జీతం ఇస్తాను. పార్టీ కోసం పనిచేయ్. ప్రభుత్వం వచ్చాక నీ ఉద్యోగం నీకు వస్తుంది' అని వైసీపీ నేత హామీ ఇచ్చినట్లు ప్రచారమవుతోంది.

..ఇలా ప్రచారంలో పాల్గొనే వలంటీర్లను అధికారులు తొలగిస్తుండగా, మరికొందరు ప్రచారంలో పాల్గొనేందుకే రాజీనామా చేస్తున్నారు. పని పోయిందని తెలిసి.. ఇంకొందరు గౌరవం కోసం రాజీనామా పత్రాలను అందిస్తున్నారు. కార్వేటినగరం, జీడీనెల్లూరు మండలాల్లో వలంటీర్లు పాత తేదీ వేసి అధికారులకు రాజీనామా అందించారు. ఇప్పటికే 14 మంది రాజీనామాలు చేయగా, మిగతావారిని అధికారులే తొలగించారు.

ప్రమాదకరమే..

'ఇప్పుడొస్తున్న పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌కే ఓటేసి గెలిపించాలి. అప్పుడే మేమంతా ఒకటో తేదీన ఇంటికొచ్చి పెన్షన్ డబ్బులు అందిస్తాం' అంటూ వలంటీర్లు ప్రచారం చేస్తున్నారు. పేదవారిని, అవగాహన, పరిపక్వత లేనివారిని ప్రలోభ పెడుతున్నారు. ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం తీరుపై అవగాహన ఉన్నవారంతా వలంటీర్ల మాటల్ని నమ్మడం లేదు. వారి ప్రచారాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రతి 50-100 ఇళ్లకు ఓ వలంటీర్ పనిచేస్తుండగా, ఆయా ఇళ్లకు సంబంధించిన డేటా మొత్తం వారి వద్దే ఉంది. లోకల్ వైసీపీ, టీడీపీ నాయకుల వద్ద లేని సమాచారం కూడా వలంటీర్ల వద్ద ఉంటుంది. ఏడాదికి నాలుగుసార్లు పలురకాల సర్వేలు చేసినవారు ఆయా కుటుంబ సభ్యులకు చెందిన అన్నిరకాల వ్యక్తిగత సమాచారం కూడా తమ వద్దే ఉంచుకున్నారు. ఇప్పుడు వారు పనిమానేసి ఆ సమాచారాన్ని వైసీపీ నేతలకు ఉపయోగపడేలా చేస్తున్నారు. ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



డీఎస్పీకి వివరాలు తెలియజేస్తున్న బాధితులు

పోలీస్‌స్టేషన్‌లో చంద్రశేఖర్ మృతదేహాన్ని ఉంచి విలపిస్తున్న భార్య, కుమార్తెలు

ఇదెక్కడి చట్టం?

సివిల్ మేటర్‌లో మీ జోక్యమేంటి?

పోలీసులు కొట్టారని బలవన్మరణానికి పాల్పడిన రైతు కుటుంబీకుల ప్రశ్న

మృతదేహంతో స్టేషన్ ఆవరణలో రాత్రి 10గంటల దాకా ఆందోళన

వెదురుకుప్పం, మార్చి 21 : ఇదెక్కడి చట్టం.. అన్నదమ్ముల మధ్య జరుగుతున్న భూతగాదాలో మీ జోక్యమేంటి అంటూ ఓ మహిళ పోలీసులను నిలదీసింది.పోలీసులు కొట్టారన్న అవమానంతో పురుగుల మందు తాగి తన భర్త చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారని, ఇప్పుడు ఆయన ప్రాణాన్ని ఎవరు వెనక్కి తెచ్చిస్తారంటూ ప్రశ్నించింది.గురువారం సాయంత్రం ఐదు గంటలకు కుటుంబీకులతో కలిసి భర్త మృతదేహాన్ని తీసుకుని స్టేషన్‌కు వచ్చిన ఆందోళనకు దిగిన ఆమె పేరు సంపూర్ణ.వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ మర్రిమాకుల కండ్రిగకు చెందిన ఆ మహిళ ఆవేదన ఆమె మాటల్లోనే..... 'మాది మాది వ్యవసాయ కుటుంబం. నా భర్త చంద్రశేఖర్(58), వాళ్ల పెద్దన్న దేశయ్య మధ్య భూ తగాదా ఉంది. దీనిపై దేశయ్య మిన్నకుండిపోయినా, ఆయన భార్య శారద(60) చీటికి మాటికి పోలీసులకు డబ్బులిచ్చి నా భర్తను ఇప్పటివరకు పదిసార్లు వేధించింది. గురువారం కూడా ఇద్దరు పోలీసులను తీసుకొచ్చింది. నా భర్త ఇంటి వద్ద ఆవులు కట్టేసి వస్తానని చెప్పినా.. వారిద్దరూ వినకుండా ఆయన మెడ పెట్టి తోసి, కొట్టి, చొక్కాపట్టి లాక్కొని వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో నేనేమీ చేయలేదు.. సివిల్ మేటర్ అని.. తర్వాత వస్తానని నా భర్త చెబుతున్నా వినకుండా ఆటోలో ఎక్కించుకెళ్లారు. పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చాక కూడా హింసించారు. ఈ అవమానాన్ని భరించలేక నా భర్త స్టేషన్ వెలుపలకొచ్చి పురుగుల మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న మేము ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు చనిపోయాడు' అని సంపూర్ణ ఆరోపించారు.

ఉద్రిక్త వాతావరణం

భర్త చనిపోయాడన్న ఆక్రోశంలో పోలీసుల తీరుపై రైతు భార్య సంపూర్ణ తిట్లదండకం అందుకుంది. ఒకదశలో కుటుంబీకులతో కలిసి మృతదేహంతో పోలీసుస్టేషన్‌లోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించింది. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్టేషన్ ముఖద్వారం వద్ద మృతదేహాన్ని పెట్టి రోదిస్తూ.. పోలీసుల పనితీరుపై విమర్శలు గుప్పించింది. అలాగే తమ తండ్రి మృతికి పోలీసులే బాధ్యులని కుమార్తెలూ విలపించారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు సమాచారంతో డీఎస్పీ కేఎస్‌మూర్తి, ట్రైనీ డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, సీఐ సత్తిబాబు తదితరులు వెదురుకుప్పం స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితులకు సర్దిచెప్పి.. రాత్రి పది గంటలకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేఎస్ మూర్తి మాట్లాడుతూ వెదురుకుప్పం పోలీసుల తీరును, బాధితుల ఆవేదనను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు.ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

అక్రమ మైనింగ్ అడ్డుకుంటే కేసులా?







గుంతలమయమైన అమినిగుంట చెరువు - టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

- స్టేషన్‌లో మూడున్నర గంటలపాటు నిర్బంధించారు
- చౌడేపల్లె టీడీపీ మండలాధ్యక్షుడి ఆవేదన

చౌడేపల్లె, మార్చి 21: అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటే తమపైనే కేసులు పెడతారా.. అని చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ప్రశ్నించారు. చౌడేపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలోని అమినిగుంట చెరువులో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మట్టిని అక్రమంగా ఎక్స్‌కవేటర్, మూడు టిప్పర్లతో తరలిస్తుంటే గురువారం సాయంత్రం తాము అక్కడికి వెళ్లి అడ్డుకుని.. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఇంతలా తవ్వేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారని, ఇలాచేస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయి కదా అని శాంతియుతంగా ప్రశ్నించామన్నారు. ఇంతలో సంఘటనా స్థలానికి వచ్చిన పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తమపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అలాగే తమపై కేసులు పెట్టారన్నారు. పైగా ఫేక్ అనుమతి పత్రాలను చూపి.. 30 అడుగుల లోతువరకు చెరువును తవ్వేసిన వారిని వదిలి.. తమను పోలీస్‌స్టేషన్‌లో మూడున్నర గంటలపాటు నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అక్రమ మైనింగ్‌పై కలెక్టర్ విచారణ చేసి, చెరువుల ఉనికిని కాపాడాలని కోరారు.

అనుమతులు ఉన్నాయి: వైస్ ఎంపీపీ

మట్టి తోలుకోవడానికి ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు ఉన్నాయని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రైతు సున్న భాస్కర్ పొలానికి మట్టిని తోలుకునేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులకు చలాన్‌కట్టి అనుమతి తీసుకున్నారన్నారు. తాము ఎక్స్‌కవేటర్, టిప్పర్లు అద్దెకు ఇచ్చామని పేర్కొన్నారు. ఈవిషయంపై ఇరిగేషన్ శాఖ డీఈ గిరిని వివరణ కోరగా.. తాము 1500క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

ఆరుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు: ఎస్ఐ

ఆరుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం అమినిగుంట చెరువులో ఓ రైతుకు వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మట్టిని తోలుతుంటే టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, పార్టీ నాయకులు గిరిరాజు, పరమేశం, ఆది, పృథ్వీ, ప్రకాష్ వచ్చి అడ్డుకున్నారన్నారు. అక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా వారిని అదుపులో తీసుకుని సెక్షన్ 151 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై స్టేషన్‌బెయిల్ ఇచ్చి పంపినట్లు పేర్కొన్నారు. మట్టిని తోలుతున్నవారు అనుమతి పత్రాలు చూపించారన్నారు. అందులో ఇరిగేషన్ అధికారుల నుంచి 1,500 క్యూబిక్ మీటర్ల మట్టి తోలుకునేందుకు అనుమతి ఉందని తెలిపారు.

పోలీసుశాఖలో 20మందికి ఉగాది పురస్కారాలు

తిరుపతి(విద్య), మార్చి 21: తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 20 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారిని ప్రభుత్వం ఏటా ఉగాది పురస్కారాలతో గౌరవిస్తుంది. వివిధ విభాగాల్లో పురస్కారాలకు ఎంపికైన వారు వీరే.

ఉత్తమ సేవా పతకాలు

సీఐ పి.జగన్‌మోహన్ రెడ్డి, తిరుపతి జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ● ఏఆర్‌ఎస్ఐ ఎస్ఆర్ ఆంజనేయులు, వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్.

కఠిన సేవా పతకం

కానిస్టేబుల్ ఎ.గోపాల్, తిరుపతి టాస్క్‌ఫోర్స్

సేవా పతకాలు

సీఐ కె.బాలయ్య, చిత్తూరు దిశ స్టేషన్
ఆర్ఎస్ఐ బి.లక్ష్మీపతి,వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్
డీఎస్పీ వి.శ్రీనివాసులు, తిరుపతి పీటీసీ వైస్ ప్రిన్సిపాల్
ఆర్ఎస్ఐ ఎం.చిరంజీవులు , తిరుపతి టాస్క్‌ఫోర్స్
ఏఎస్ఐ ఎం.జయచంద్ర శెట్టి, పుంగనూరు
హెడ్‌కానిస్టేబుల్ పి.మోహనయ్య , నింద్ర
హెడ్‌కానిస్టేబుల్ కేఎస్ నరేంద్ర కుమార్,చిత్తూరు ట్రాఫిక్
ఏఎస్ఐ సి.గోపాలరెడ్డి, తిరుపతి ట్రాఫిక్
ఏఎస్ఐ టి.సురేష్‌బాబు , తిరుపతి వెస్ట్
ఏఆర్ఎస్ఐ ఎస్.జయప్రసాద్‌బాబు, తిరుపతి
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.ధనంజయులు, తిరుపతి
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసులు,
తిరుపతి హోంగార్డ్స్ ఇంచార్జి
కానిస్టేబుల్ పి.శారద,ఎయిర్‌పోర్ట్ స్టేషన్, తిరుపతి
కానిస్టేబుల్ ఎం.నందకుమార్, తిరుపతి టాస్క్‌ఫోర్స్

ఉత్తమ సేవాపతకాలు (అగ్నిమాపక శాఖ)

ఫైర్ ఆఫీసర్ కె.శ్యాంబాబు, నాయుడుపేట
లీడింగ్ ఫైర్‌మెన్ వి.ఉమాపతి, పుత్తూరు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సేవా పతకం

తిరుమల ఎస్ఐ జె.రామకృష్ణారావు.

24, 25 తేదీల్లో చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం, మార్చి 21: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గ పర్యటన ఖరారైంది. సొంత నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ఇంకా కచ్చితమైన షెడ్యూల్ నిర్ధారణ కాకున్నా చంద్రబాబు ఈ రెండ్రోజుల్లో సుడిగాలి పర్యటన చేయనున్నట్లు తెలిసింది. రోడ్ షోలలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి శ్రేణులు సిద్ధమవుతున్నాయి.





నిర్మాణదశలో నిలిచిపోయిన ఆర్కేవీబీ పేట జడ్పీ హైస్కూల్ భవనం - అసంపూర్తిగా ఉన్న పాదిరికుప్పం జడ్పీ హైస్కూల్ భవనం

కార్వేటినగరం మండలంలో..

మండలంలోని పాదిరికుప్పం, ఆర్కేబీవీ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండో విడతలో చేపట్టిన విద్యార్థుల తరగతి గదుల భవన నిర్మాణాలు మోల్డింగ్ వరకు జరిగాయి. నిధుల కొరత కారణంగా నిర్మాణాలు ఆగిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై ఇంజనీర్లను పలుమార్లు వివరణ కోరినా, సమాధానం చెప్పడం లేదు. - కార్వేటినగరం



పెనుమూరు మండలంలో..

మండలంలోని లక్కలపూడి వాండ్ల ఊరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద రెండో విడతలో సుమారు కోటి రూపాయల పనులు ప్రారంభించారు. సిమెంట్ కొరత, నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేసినట్లు తెలిపారు.

- పెనుమూరు

నత్తనడకన 'నాడు-నేడు' పనులు

రెండో విడతలో 40 శాతం కూడా పూర్తికాలేదు ● మొదటి విడతలోనూ 57 పాఠశాలల్లో కొనసాగుతున్నాయి

చిత్తూరు సెంట్రల్, మార్చి 21: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తాం. ప్రభుత్వ బడులు రూపురేఖలు మార్చేస్తాం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు తీర్చిదిద్దుతాం. ఇలా గొప్పలు చెప్పుకున్న జగన్ సర్కార్.. రెండో విడత మనబడి నాడు-నేడు పనులు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమైంది. మొదటి విడత పనులు కూడా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. 40 శాతం కూడా పూర్తికాని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తొలుత ఇసుక సమస్య, ఆపై సిమెంట్ సరఫరాలో జాప్యం, ఫర్నిచర్ సకాలంలో అందించలేక పోవడం వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా (చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య)లో రెండో విడత కింద 2,322 పాఠశాలల్లో రూ.788.52 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో మనబడి నాడు-నేడు పనులు ప్రారంభించారు. 2022 డిసెంబరు నాటికి పనులు పూర్తి చేసి, నూతన హంగులతో ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులో తెస్తామని జగన్ ప్రభుత్వం డప్పు కొట్టింది. నిర్దేశించిన సమయానికి ప్రారంభించిన పనులు కనీసం 10 శాతం కూడా పూర్తి కాకపోవడంతో 2023 మే నెలాఖరులోపు, ఆపై సెప్టెంబరు నెలకు గడువును పొడిగించింది. అయినా 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. చివరకు 2024 జనవరి వరకు గడువు పొడిగించినా.. 40 శాతం పనులు కూడా జరగలేదు. దీనికి నిధులు సకాలంలో విడుదల చేయక పోవడమే ప్రధాన కారణమని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

నిర్మాణాలు అసంపూర్ణం : నిర్మాణాలు అసంపూర్ణంగా ఉండటంతో పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల చెట్ల కింద, వరండాల్లో ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు.

మొదటి విడతలో ఇలా.. : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి విడతలో నాడు-నేడు కింద 1,533 పాఠశాలలు రూపురేఖలు మార్చేందుకు రూ.354 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.320 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ విడతలో నాబార్డు నిధులతో 57 పాఠశాలల్లో చేపట్టిన పనులు ఇంకా జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఖర్చు చేసింది 36 శాతమే..

రూ.788.25 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించినా, 2024 ఫిబ్రవరి నాటికి కేవలం రూ.280.62 కోట్లు (35.58 శాతం) మాత్రమే ఖర్చు చేశారు. చిత్తూరు జిల్లాలో 35 శాతం పనులు పూర్తవగా, 39 శాతం నిధులు ఖర్చు చేశారు. తిరుపతి జిల్లాలో 32.52 శాతం నిధులు ఖర్చు చేసినా, 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. అన్నమయ్య జిల్లాలో 30.19 శాతం నిధులు ఖర్చు చేసి.. 20 శాతం పనులు పూర్తి చేశారు.

రెండో విడత పనుల వివరాలిలా..

జిల్లా పేరు	మొత్తం పాఠశాలలు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	ఇప్పటి వరకు అయిన ఖర్చు (రూ.లక్షల్లో)
చిత్తూరు	1210	424.10	165.75 (39 శాతం)
తిరుపతి	631	207.50	67.48 (32.52 శాతం)
అన్నమయ్య	478	156.92	47.38 (30.19 శాతం)
మొత్తం	2322	788.52	280.62 (35.58 శాతం)

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : సా. 6.29
సహరి (శనివారం) : ఉ. 4.55

ఇద్దరు వలంటీర్ల తొలగింపు



ప్రచారంలో పాల్గొన్న వలంటీరు రోహిత్ - ద్విచక్రవాహనంపై వైసీపీ జెండాతో వలంటీర్ మదన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: గుడిపాల మండలం రామభద్రాపురం క్లస్టర్-5 వలంటీరు పి.రోహిత్ చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డితో కలిసి గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. దీంతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన కారణంగా రోహిత్‌ను విధులనుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన మదన్ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ, మండల వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పదవిలో కొనసాగుతున్నారు. వైసీపీ స్టిక్కర్లతోపాటు పార్టీ జెండాను కట్టిన ద్విచక్ర వాహనంపై ఆయన మండల కేంద్రంలో పలుచోట్ల పర్యటిస్తూ తీసుకున్న వీడియో, ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో స్వయంగా పోస్టుచేసి హల్‌చల్ చేశారు. దీనిపై ఎంపీడీవో భాస్కర్‌కు సమాచారం అందింది. ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు వలంటీర్ మదన్‌ని విధుల నుంచి తొలగించారు. అలాగే గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన మరో వలంటీర్ డిల్లీకుమార్ గురువారం సాయంత్రం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు.

కారు సహా చీరల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న చీరలను పరిశీలిస్తున్న సీఐ

సోమల, మార్చి 21: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తరలిస్తున్న చీరలను కారుతోపాటు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో బెంగళూరు నుంచి పీలేరుకు వెళుతున్న కారును సోమల పోలీసులు గురువారం ఉదయం స్థానిక బస్టాండులో తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 113 చీరలు, 172 టాప్‌లు, 126 లంగా పీసులు, మరికొన్ని వస్తువులను గుర్తించారు. దీంతో వాటిని వాహనంతోపాటు స్వాధీనం చేసుకున్నారు. విచారిస్తున్నామని పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అధికారులకు సమాచారం అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొన్నిచోట్ల ఇంకా ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి.

మద్యం దుకాణం సేల్స్‌మేన్ తొలగింపు

కల్లూరు, మార్చి 21: 'పులిచెర్ల మండలం కల్లూరు-1 ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మేన్ కేశవులు నాయుడు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. దీంతో ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు' అని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, మద్యం డిపో మేనేజర్ ఆయేషా తెలిపారు. ఈనెల 17వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో సేల్స్‌మేన్ కేశవులునాయుడు పాల్గొన్నారంటూ స్థానిక టీడీపీ నాయకులు సీ-విజిల్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కి ఫిర్యాదు చేశారు. దీనిపై జరిగిన విచారణలో కోడ్ ఉల్లంఘించినట్లు రుజువు కావడంతో సేల్స్‌మేన్‌ని విధుల నుంచి తొలగించినట్లు ఆయేషా తెలిపారు.

ఎఫ్ఏలపై చర్యలకు విచారణ నివేదిక అందజేత

పులిచెర్ల మండలం మంగళంపేట పంచాయతీ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న క్షేత్ర సహాయకుడు (ఎఫ్ఏ) మధు ఈనెల 17వ తేదీన మండల వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని స్థానిక టీడీపీ నాయకులు సీ-విజిల్, ఎంపీడీవో సురేష్‌బాబుకు ఫిర్యాదుచేశారు. దీనిపై ఎంపీడీవో విచారించి, మధు నుంచి రాతపూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారు. నివేదికను డ్వామా పీడీ రాజశేఖర్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు. కాగా, ఇదే ర్యాలీలో పాల్గొన్న అయ్యావాండ్లపల్లి, దిగువపోకలవారిపల్లి ఉపాధి క్షేత్రసహాయకులపై ఫిర్యాదులు అందడంతో ఎంపీడీవో ఇప్పటికే వారిని విచారించి, నివేదికలను డ్వామా పీడీకి పంపారు.

పలువురిపై వేటు వేసిన అధికారులు



ర్యాలీలో కేశవులునాయుడు పాల్గొన్నట్లు టీడీపీ నేతలు ఇచ్చిన ఫొటో

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కుప్పం, మార్చి 21: గుడుపల్లె మండలం ఉపాధి హామీ పథకం బెగ్గిలపల్లె పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు బుధవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బెగ్గిలపల్లె పంచాయతీ గణేశ్‌పురం క్రాస్ సీతారాముల ఆలయం ఎదుట జడ్పీటీసీ కృష్ణమూర్తి, ఎంపీపీ వరలక్ష్మితో కలిసి, పార్టీ టోపీ వేసుకుని మరీ దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దాంతో ఎన్నికల నియమావళిని అతిక్రమించారనే కారణంతో ఆయన్ను ఉద్యోగంనుంచి సస్పెండ్ చేస్తూ పీడీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉల్లంఘనలపై తగిన చర్యలు తీసుకోండి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం రాత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఆర్వోలు, ఏఆర్వోలు, ఏఈఆర్వోలు, నోడల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధులకు ఉద్యోగులు గైర్హాజరౌతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిజమని తేలితే అట్టివారిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, ప్రచారాల్లో పాల్గొంటున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని, వారు తమ డీలర్‌షిప్పులకు రాజీనామా చేసి ప్రచారాల్లో పాల్గొనాలని, లేకుంటే వారిపై ఈసీ సూచనల మేర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, జడ్పీసీఈవో గ్లోరియా, డీఎల్డీవో రవి కుమార్, పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో జడ్పీ హైస్కూల్ వాచ్‌మేన్



వైసీపీ ప్రచారంలో వాచ్‌మేన్ పృథ్వి

కుప్పం, మార్చి 21: అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే క్రమం ఆగడం లేదు. తాజాగా కుప్పం పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కాంట్రాక్టు వాచ్‌మేన్ పృథ్వి.. వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. కుప్పం మున్సిపాలిటీ 13వ వార్డులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే.భరత్ ప్రచారం చేస్తుండగా.. మెడలో పార్టీ కండువాతో ఆ బృందంలోని కార్యకర్తలతో కలసి నడిచి స్వామిభక్తిని చాటుకున్నారు.



ఉలవలదిన్నెలో వాటర్ ట్యాంకుపై రెపరెపలాడుతున్న వైసీపీ జెండా

వాటర్ ట్యాంకుపై వైసీపీ జెండా

పుంగనూరు, మార్చి 21: పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె గ్రామంలో వాటర్ ట్యాంకుపై వైసీపీ జెండా రెపరెపలాడుతోంది. ఇటువంటి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



గంగవరం సచివాలయం వద్ద వైసీపీ రంగులు

గంగవరం, మార్చి 21: గంగవరం సచివాలయం ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులున్నాయి. కింది భాగంలో కొంత మార్చి, పైభాగంలో వదిలేశారు. దీంతోపాటు తహసీల్దార్ కార్యాలయ ప్రహరీకి ఉన్న వైసీపీ రంగుల పెయింటింగ్‌లో కింది భాగంలో ఉన్న ఒక్క రంగు మాత్రం తుడిచేసి, మమ అనిపించారు.

తిరుచానూరు ఆలయంలో క్యూకాంప్లెక్సుకు గ్రీన్‌సిగ్నల్

- రూ.23 కోట్లతో మూడంతస్తుల భవన సముదాయం
- మాడవీధుల్లో కదిలే వంతెన

తిరుచానూరు, మార్చి 21 : శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి కొలువైన తిరుచానూరులో అత్యాధునిక క్యూకాంప్లెక్సు పనులు మొదలయ్యాయి.భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో గత యేడాది ఆగస్టులో టీడీపీ పాలకమండలి రూ.23కోట్ల వ్యయంతో తిరుమల తరహాలో అత్యాధునిక క్యూకాంప్లెక్సు నిర్మాణానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.గత నెల క్యూకాంప్లెక్సు టెండర్‌ను దక్కించుకున్న కంపెనీ పనులు ప్రారంభించింది. పాత డిప్యూటీ ఈవో కార్యాలయ భవన సముదాయంలో ఈ క్యూకాంప్లెక్సును నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా 0.75ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత డిప్యూటీ ఈవో కార్యాలయం, కల్యాణమండపం సముదాయాన్ని తొలగిస్తున్నారు.క్యూకాంప్లెక్సు నిర్మాణానికి సుమారు ఏడాదికి పైగా పడుతుందని టీటీడీ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు తెలిపారు. తిరుమల తరహాలో క్యూకాంప్లెక్సులో ప్రవేశించిన భక్తులు అన్ని సేవలూ అక్కడే పొంది ప్రత్యేక క్యూలైను ద్వారా అమ్మవారి దర్శనం చేసుకుని బయటకు వచ్చేలా క్యూకాంప్లెక్సు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మూడంతస్తులతో క్యూకాంప్లెక్సు నిర్మాణం జరగనుంది. సెల్లార్‌లో లాకర్లు, సెల్‌ఫోన్, పాదరక్షల కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు టిక్కెటు కౌంటర్లు, సెక్యూరిటీ పాయింట్ వస్తాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వెయిటింగ్ హాల్, కల్యాణకట్ట రానుంది. ఇంకో అంతస్తులో క్యూలైన్, వెయిటింగ్ హాల్ రానుంది.నాల్గవ గేట్ వద్ద నిర్మించనున్న ఈ క్యూకాంప్లెక్సులోకి భక్తులు ప్రవేశించిన తరువాత లగేజీలను అక్కడే భద్రపరచుకుని ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనానికి వెళతారు. ఇక తిరుమల మాడ వీధుల్లో ఉండే మూవింగ్ బ్రిడ్జి(కదిలే వంతెన)ను పాత పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించనున్నారు. అమ్మవారి ఉత్సవాల సమయంలో వాహనసేవలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు ఈ నూతన క్యూకాంప్లెక్సు నుంచి కదిలే వంతెన ద్వారా పుష్కరిణి పక్కనే ఏర్పాటు చేయనున్న క్యూలైను ద్వారా ఆలయం వెలుపల ఉన్న ప్రాకారం గుండా ఇపుడున్న క్యూలైన్‌లోకి భక్తులు ప్రవేశించనున్నారు.

టెన్త్ జవాబు పత్రాల డీకోడింగ్ ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 21: టెన్త్ పరీక్షలు జరుగుతున్న తరుణంలోనే ఇతర జిల్లాల నుంచి మన జిల్లా కేంద్రానికి వచ్చిన జవాబు పత్రాలను స్థానిక పీసీఆర్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో గురువారం సిబ్బందికి సమావేశం నిర్వహించి, జవాబు పత్రాల డీకోడింగ్‌పై సూచనలు చేశారు. అనంతరం డీకోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.

చిత్తూరులో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: ద్రోణి ప్రభావ కారణంగా చిత్తూరు నగరంలో గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో తేలికపాటి వర్షం కురిసింది. దాంతో రాత్రంగా అధిక ఉష్ణోగ్రతతో ఇబ్బంది పడ్డ నగర ప్రజలకు ఈ వర్షం ఆహ్లాదకర వాతావరణం కలిగించింది.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

లోకేశ్ సమక్షంలో భారీగా చేరిన జీడీనెల్లూరు నాయకులు



నారా లోకేశ్‌తో సూరిరెడ్డి

శ్రీరంగరాజపురం, మార్చి 21: డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రాతినిథ్యం వహిస్తున్న జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి వలసలు పెరిగాయి. గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో తిరుపతి విమానాశ్రయంలో ఎస్ఆర్‌పురం మండలం నుంచి దాదాపు వందమంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందిన చిత్తూరు పార్లమెంటు వైసీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌రెడ్డి అలియాస్ సూరిరెడ్డికి లోకేశ్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సూరిరెడ్డి చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సొంత పంచాయతీకి చెందినవారే. సూరిరెడ్డివెంట మరో 60 మంది అనుచరులు చేరారు. అలాగే ఈ మండలంలోనే పుల్లూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు గుర్రప్ప, గిరి, వైసీపీ నేత రమేశ్ సహా పలువురు విమానాశ్రయంలోనే టీడీపీలో చేరారు. వైసీపీలో అరాచకాన్ని సహించలేకే టీడీపీలో చేరామని తెలిపారు. వైసీపీలో అణచివేతకు గురి చేస్తున్నారని సూరిరెడ్డి ఆరోపించారు.

పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడి



ముసలిమడుగు వద్ద ఏనుగు తొక్కి నాశనం చేసిన వరిపొలం

పలమనేరు, మార్చి 21: పలమనేరు మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతం నుంచి వారం రోజులుగా ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడులకు పాల్పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండ్రోజుల కిందట ముసలి మడుగు గ్రామానికి చెందిన రామచంద్రనాయుడు అనే రైతు సాగుచేసిన వరి పొలంలో దాదాపు అర ఎకరాను తొక్కి నాశనం చేసింది. అంతేకాక రామచంద్రనాయుడు ఆవుల కోసం నిర్మించిన షెడ్ గోడను సైతం కూల్చివేయడంతోపాటు తవుడు, పొలం వద్ద నాటిన అరటి చెట్లు సైతం పెరికి తినేసింది. దీనివల్ల రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లాలంటే చుట్టుపక్కల రైతులు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఒంటరి ఏనుగు నుంచి రక్షణ కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



తెప్పపై రుక్మిణీకృష్ణుల విహారం

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి):తిరుమలలో నిర్వహిస్తున్న శ్రీవారి తెప్పోత్సవాల్లో రెండవరోజైన గురువారం రుక్మిణీకృష్ణులు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, అన్నమయ్య కీర్తనల ఆలాపనల నడుమ ఉత్సవమూర్తులను తెప్పపై పుష్కరిణిలో మూడుచుట్లు తిప్పారు.శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తెప్పపై దర్శనమివ్వనున్నారు.

మంచి రోజులొస్తాయి

ధైర్యంగా పనిచేయండన్న లోకేశ్

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనను కలిసిన పార్టీ నాయకులతో ఆప్యాయంగా మాట్లాడారు. తిరుమలలోని గాయత్రి సదన్ అతిథిగృహం వద్దకు బుధవారం రాత్రి చేరుకున్న ఆయన అక్కడున్న కార్యకర్తలతో మాట్లాడారు. దాదాపు 15 నిమిషాలు బయటే నిలబడి కార్యకర్తలతో ఫొటోలు దిగారు.గురువారం కూడా శ్రీవారి దర్శనానంతరం తనను చూసేందుకు వచ్చిన నాయకులతో, కార్యకర్తలతో కొంతసేపు మాట్లాడారు. 'ఎలా ఉన్నారు, మంచి రోజులు వస్తాయి, ధైర్యంగా పనిచేయండి' అని సూచించారు.చూడ్డానికి వచ్చిన ఎన్టీ రామారావు వీరాభిమాని, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎన్టీఆర్ రాజును (రామచంద్రరాజు)ను ఆరోగ్యం ఎలా వుందంటూ పరామర్శించారు. ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, అనురాధ, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, ఆదిమూలం, పార్టీ నాయకులు నరసింహయాదవ్,పులిగోరు మురళి, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, జేబీ శ్రీనివాస్,రవినాయుడు, శ్రీధర్‌వర్మ, రాజు యాదవ్, కేశవులు, శివషణ్ముగం, దేవ, బాలాజి, విశ్వ, అంజి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిపై తొలగని సస్పెన్స్

మీరు గెలుపు కోసం పనిచేయండి! అభ్యర్థి సంగతి అధ్యక్షుడు చూసుకుంటారు!!

తిరుపతి జనసేన నేతలతో నాగబాబు



నాగబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు

తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన సీటు గెలుపు కోసం మీరు పనిచేయండి... అభ్యర్థి సంగతి అధ్యక్షుడు పవన్ చూసుకుంటారు... అంటూ తిరుపతి జనసేన నాయకులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన తిరుపతి నాయకులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సందర్భంగా పలువురు నాయకులు తిరుపతిలో నెలకొన్న పరిస్థితులను నాగబాబు దృష్టికి తీసుకెళ్ళారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి అయినా కార్యకర్తలకు అండగా నిలిచే నేతకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు పలువురు నాయకులు బయటి వారికి టికెట్ ఇస్తే తిరుపతి ప్రజలు ఆమోదించే పరిస్థితి లేదన్నారు. పార్టీ అభ్యర్థి తమను ఇంతవరకూ కలవలేదని, కార్యక్రమాల గురించి సమాచారం కూడా ఇవ్వడం లేదని మహిళా నేతల్లో సుభాషిణి ఫిర్యాదు చేయగా కీర్తన మాత్రం పార్టీ అభ్యర్థి మంచివారని, తిరుపతిలో లోకల్, నాన్ లోకల్ అన్న వాదన అర్థరహితమన్నారు. అత్యధికులు అభ్యర్థిగా స్థానికులకు అవకాశం ఇవ్వాలని కోరగా కొందరు పార్టీ ఎవరికి ఇచ్చినా పనిచేస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందడం లేదని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ఫిర్యాదు చేశారు. స్థానికుల్లో పోటీ చేయడానికి ఎవరు ఆసక్తిగా వున్నారని నాగబాబు ప్రశ్నించడంతో హరిప్రసాద్, కిరణ్ రాయల్ తాము పోటీ చేసేందుకు ఆసక్తిగా వున్నట్టు చెప్పారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమకున్న వనరులను కూడా వివరించారు. ఈ ఇద్దరూ కాకుండా ఇతరులెవరైనా వున్నారా అని నాగబాబు ప్రశ్నించగా కొందరు నాయకులు సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ పేరును ప్రస్తావించారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ ప్రస్తుత అభ్యర్థి తిరుపతిలో గెలిచే అవకాశం లేదని, అతన్నే కొనసాగిస్తే ఓడిపోవడంతో పాటు పార్టీ ప్రతిష్ఠ కూడా దెబ్బతింటుందని స్పష్టం చేశారు. మెజారిటీ నాయకులు అభ్యర్థిని మార్చాలని, స్థానికులైన ఆశావహులతో రీ సర్వే జరిపించాలని కోరగా నాగబాబు పరిశీలిస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందని విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పవన్ కళ్యాణ్ మాట్లాడతారని నాగబాబు హామీ ఇచ్చారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఖచ్చితంగా గెలవాలని, దానికి ఏం చేయాలో చెప్పండని సలహాలు, సూచనలూ కోరారు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో ఎపిక్ కార్డుల కుంభకోణానికి సంబంధించి వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి పాత్ర ఏమైనా వుందా అన్న విషయమై లోతుగా ఆరా తీయాలని ఆదేశించారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి గెలవాలని, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాలను గౌరవించాలని ఆయన కోరారు. పార్టీ కోసం పనిచేసే వారిని పేరుపేరునా గుర్తుంచుకుంటామని, వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో అభ్యర్థి విషయంలో తలెత్తిన వివాదంపై పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుతో చర్చిస్తున్నారని వివరించారు. లోకల్, నాన్ లోకల్ సమస్య లేవనెత్తి వైసీపీ ట్రాప్‌లో పడొద్దంటూ ఆయన హెచ్చరించారు. తిరుపతి నేతలతో త్వరలో అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమావేశమవు తారన్నారు. రాజకీయాల్లో ఎపుడు, ఎవరికి ఏమి జరుగుతుందన్నది చెప్పలేమని, కొన్నిసార్లు త్యాగాలు చేయాల్సి వస్తుందన్నారు. తాను కూడా ఎంపీగా పోటీ చేసేందుకు ఓ నియోజకవర్గంలో కొంతకాలం పని చేశానని, అయితే తర్వాత ఆ నియోజకవర్గం వదులుకోవాల్సి వచ్చిందని స్వానుభవం వెల్లడించారు. పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారని, ఆ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థి విషయం పార్టీ అధ్యక్షుడు చూసుకుంటారని, ఆ విషయం ఆయనకు వదిలిపెట్టి తిరుపతిలో జనసేన గెలిచేందుకు కష్టపడి పనిచేయాలని ఆయన తిరుపతి నాయకులను ఆదేశించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచీ సాయంత్రం 5.30 గంటల వరకూ సమావేశం కొనసాగగా పార్టీ పరిశీలకుడు అజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. దీంతో తిరుపతి జనసేన అభ్యర్థిగా అరణి శ్రీనివాసులే కొనసాగుతారా? లేక మార్పు వుంటుందా? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే మిగిలిపోయింది. తిరుపతి నాయకులతో త్వరలో పవన్ కళ్యాణ్ సమావేశమయ్యేదాకా అభ్యర్థిపై నెలకొన్న సస్పెన్స్ ఇలాగే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

లోకేశ్‌తో ఆరణి భేటీ



తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తిరుమలలో కలిశారు.టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆయన వెంట వున్నారు.అనంతరం శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను లోకేశ్‌కు వివరించా నన్నారు.స్థానిక నేతలతో మాట్లాడి తనకు సహకరించేలా చూడాలని అభ్యర్థించగా ఒకట్రెండురోజుల్లో పరిస్థితులు సర్దుకుంటాయని, జాగ్రత్తగా పనిచేసుకోండని లోకేశ్ సూచించినట్టు చెప్పారు.అనంతరం మరో బృందంగా టీడీపీ నాయకులు ఊకా విజయ్‌కుమార్, నరసింహ యాదవ్, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులు లోకేశ్‌ను కలిశారు.

చంద్రబాబు మన కుటుంబ సభ్యుడు : బీఆర్



కుప్పంలో ప్రచారం చేస్తున్న డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు

కుప్పం, మార్చి 21: చంద్రబాబు కుప్పం ప్రజల కుటుంబ సభ్యులని టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం మున్సిపాలిటీ 18వ వార్డులో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి, కరపత్రాలు పంచిపెట్టారు. చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు పి.గోపీనాథ్, ఆర్ఆర్.రవి, జాకిర్, మంజునాథ్, వేణు, లోకేశ్, ఖాసీం పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటా ప్రచారం



విజలాపురంలో టీడీపీ నేతల ప్రచారం

రామకుప్పం, మార్చి 21 : మండలంలోని విజలాపురం, బగలనత్తం గ్రామాల్లో గురువారం టీడీపీ నాయకులు, కార్య కర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పట్టించుకోక పోవడంతో ప్రజలు మరింత పేదరికంలోకి వెళ్ళార న్నారు. దీనిని గుర్తించిన చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్లను ప్రకటించారన్నారు. కుప్పం ప్రజలు టీడీపీకి ఓట్లు వేసి చంద్రబాబుకు లక్ష మెజారిటీ అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు ఆనందరెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, శ్రీనాథరెడ్డి, కుమార్, బాబు రెడ్డి, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్‌గౌడు, మునెప్ప, మునిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, సుకుమార్‌రెడ్డి, జయప్ప పాల్గొన్నారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యం సాధ్యం

గంగవరం, మార్చి 21 : సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం సాధ్యమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కళామందిరంలో కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..అక్షరాల విత్తులు నాటి ఊహలతో సాగు చేసిన వారే కవి అని అన్నారు. నేటి సమాజంలో సాహిత్యాన్ని చదవేవారి సంఖ్య విపరీతంగా తగ్గిపోతోందన్నారు. కావున కవులు, రచయితలు సాహిత్యాన్ని నేటి తరానికి ఉపయోగపడేలా విలువలతో కూడిన సాహిత్యాన్ని అందించి, భాషను బతికించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, సయ్యద్ మొహిద్దిన్, చంద్రశేకరయ్య లతోపాటు పలువురు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై ఊరేగిన శ్రీవారు



పుంగనూరు రూరల్, మార్చి21: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణ స్వామి గురువారం శ్రీకృష్ణుడి అవతారంలో కల్పవృక్ష వాహనంపై వైభవంగా ఊరేగారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు స్వామి వారిని సుప్ర భాతంతో మేల్కొల్పి పూర్ణకుంభ హోమం, అభిషేకాలు, వివిధ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిలో కల్పవక్ష వాహనంలో మంగళవాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మంగళహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకు న్నారు. రాత్రి హనుమంత వాహనంపై శ్రీవారు ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పృథ్వీరాజు, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో కేంద్ర బలగాల కవాతు



కుప్పం, మార్చి 21: కుప్పం పట్టణంలో కేంద్ర బలగాలు గురువారం సాయంత్రం స్థానిక పోలీసులతో కలసి కవాతు చేశాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతాయన్న భరోసా ఓటర్లకు కల్పించే ప్రయత్నం చేశారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగిం చుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు అధికారులు తెలిపారు.

పేద ముస్లింలకు రంజాన్ సరుకుల పంపిణీ



పుంగనూరు, మార్చి 21: రంజాన్ పర్వదినం సందర్భంగా పేద ముస్లిం లకు కేహెచ్‌కే ఫలాహ్ వెల్ఫేర్ ట్రస్టు ప్రతినిధులు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గురువారం స్థానిక కొత్తపేట ఫలాహ్ స్కూల్ ఆవరణలో 100మంది పేదలకు సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు కార్యదర్శి కే.ఇస్మాయిల్‌ఖాన్ మాట్లాడుతూ ట్రస్టు వ్యవస్థాపకుడు హాఫీజ్‌ఖాన్ గత 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేసి ఎంతోమందికి సహాయం చేశారని, ఆయన ఆశయాలను నేరవేర్చడానికి ప్రతి ఒక్కరికీ రూ. 2వేలు విలువ చేసే సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అబ్దుల్ , అలీం, మౌలానా, కమాలుద్దీన్, అహ్మద్‌ఖాన్, షఫి, రియాజ్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలను తీర్చే పార్టీ కాంగ్రెస్



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి21: ప్రజల కష్టాలను తీర్చేది కాంగ్రెస్ పార్టీనే అని కాంగ్రెస్ పార్టీ పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని భీమగానిపల్లె పంచాయతీలోని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేదలు ఇల్లు కట్టుకునే పరిస్థితిలో లేరని, ఇసుక, సిమెంటు, కమ్మి ధరలు తీవ్రస్థాయిలో ధరలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మంచిపాలన అందించే పార్టీలకు ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు బుడ్డారెడ్డి, శ్రీదేవి, మాకునాయక్ పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

గంగవరం : కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసీనాథం నాయుడు మాట్లాడుతూ ప్రతివిద్యార్థి పొట్టిశ్రీరాములును ఆదర్శంగా తీసుకొని భాషా పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

టిడ్కో ఇళ్లకు కరెంట్ కష్టాలు

- మీటరు పెట్టాలంటే రూ.500 ఇవ్వాల్సిందే..!
- అసంపూర్తి నిర్మాణాలతో లబ్ధిదారుల ఇక్కట్లు



పుంగనూరు టిడ్కో ఇళ్లు

పుంగనూరు, మార్చి 21: పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ఏడాది అక్టోబరు 13వ తేది టిడ్కో ఇళ్లను అట్టహాసం గా ప్రారంభించి గృహ ప్రవేశాలు చేయించినా లబ్ధిదారులకు కరెంట్ కష్టాలు తీరడం లేదు. అలాగే మౌళిక వసతులు లేకపోవడం, అసం పూర్తి ఇళ్ల నిర్మాణాల వల్ల అత్యధిక శాతం లబ్ధిదారులు ఇళ్లలోకి కాపురాలకు వెళ్లలేదు. మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ షన్మోహన్, పలువురు ప్రజాప్రతినిధులు నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్ల తాళాలు ఇస్తున్నట్లు ఫొటో ఫోజులిచ్చారు తప్ప వివిధ సమస్యల వల్ల కొన్నింటికి మినహా అన్ని ఇళ్లకు తాళాలే దర్శనమిస్తు న్నాయి. పుంగనూరు-పలమనేరు రోడ్డులోని గూడూరుపల్లె వద్ద టిడ్కో ద్వారా 1536 మంది కి ఇళ్ల ఇచ్చారు. ఇళ్లకు కరెంట్ మీటర్లులేక అంధకారంలో ఉండటం వల్ల కాపురాలు వెళ్లలేదు. కేవలం 200 మంది కూడా టిడ్కో ఇళ్లల్లో చేరలేదు. విద్యుత్ మీటర్లను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాల్సిఉంది. కానీ లబ్ధిదారుల వద్ద ఎస్పీడీసీ ఎల్ ఉద్యోగులు మాత్రం విద్యుత్ మీటర్ల కొరత ఉందని, ఆలస్యం అవుతు న్నాయని చెబుతూ ఉచితంగా ఏర్పాటు చేయాల్సిన మీటర్ల ఏర్పాటుకు రూ.500 చొప్పన వసూళ్ల చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగ నూరులో మీటర్లులేవని చెప్పడం, పనులు ఆలస్యం చేస్తున్నారు. టిడ్కో ఇళ్ల వద్ద బోర్లు వేసినా ఓవర్‌హెడ్ నిర్మాణం పూర్తికాలేదు. పలుచోట్ల తాగునీటి పైపు లైన్లు, కొళాయి కనెక్షన్లు ఇవ్వాల్సిఉంది. ఇళ్లకు పలుచోట్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్నిచోట్ల కిటికీ లు, తలుపులు సక్రమంగా అమర్చ లేదు. ఎలక్ట్రికల్ పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. పూర్తిస్థాయిలో పనులన్నీ కాంట్రాక్టర్ చేయాల్సి ఉన్నా ఇటీవల మదనపల్లె టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం సందర్భంగా పనులు చేసే సిబ్బంది, ఇక్కడ ఉన్న మెటీరియల్ తీసుకెళ్లిపోయారు. చేయాల్సిన పనులు లబ్ధిదారులే చేసుకోవాలని కొందరు ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేయించి లబ్ధిదారులకు ఇవ్వాల్సిఉంది.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి





రామకుప్పంలో వీఆర్వోలు, కార్యదర్శుల సమావేశంలో తహసీల్దారు - ఎంపీడీఓ, కల్లూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

కల్లూరు, మార్చి 21: ఎన్నికల నియమావళిని అధికారులు, సిబ్బంది తప్పక పాటించాలని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ వసంతలత, ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, ఆశా వర్కర్లు, వీవో లీడర్లు, సచివాలయ సిబ్బందితో గురువారం వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంసీసీ టీంకు సిబ్బంది సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం : ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై క్షేత్రస్థాయిలో అధికార యం త్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు శ్రీధర్, ఎంపీడీఓ ఈశ్వరయ్య కోరారు. గురువారం మండల సచివాయలంలో వీఆర్వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోడ్ అమలుపై అందరూ నిష్పక్ష పాతంగా వ్యవహరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయపార్టీల కరప త్రాలు, ఫ్లెక్సీలు, పతాకాలుంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. కార్యక్ర మంలో డీటీ దిలీప్‌కుమార్, రెవిన్యూ, మండలపరిషత్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

రామకుప్పం, మార్చి 21: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారని, ఆయన పర్యటనను జయప్రదం చేయాలని ఆయన పీఏ మనోహర్, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. గురువారం రామకుప్పం పార్టీ కార్యాల యంలో పార్టీ ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు పార్టీ శ్రేణులతోపాటు, పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా చూడా లని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలను వివరించాలన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడటాన్ని, అవినీతి, అరాచకాలను కూడా ప్రజలకు వివరించాలని వారు కోరారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మణీంద్రం పంచాయతీ మొద్దులవంకకు చెందిన వైసీపీ నేతలు నరేష్, ప్రశాంత్‌రెడ్డిలు గురువారం టీడీపీలో చేరారు. చంద్రబాబు పీఏ మనోహర్ వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మునస్వామి, చలపతి, విశ్వనాథ్, వెంకటా చలం, రామ్మూర్తి, గంట్లప్పగౌడు, రామకృష్ణప్ప, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, గజేంద్ర, మనోహర్, సత్తి, కామరాజనాయక్, జయశంకర్, కొల్లపల్లెబాబు, సలాం సాబ్, వెంకటరమణ, భానుమూర్తి, టీవీరవి, విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాలరాజు, సుబ్రీ, సతీష్, మంజునాథ్, ఆదిల్, అవినాశ్, అమర్, జ్ఞానశేఖర్ రెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



బేలుపల్లె పంచాయతీలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, మార్చి 21 : రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బెల్లంమడుగు, బొల్లోనికుంట, చెలగానిపల్లె, ఆకులకొత్తూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సంక్షేమపథకాల గురించి వివరించారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం జరగనున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓట్లేసి టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు మాజీమంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలుకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం



చిన్నారులచే కేక్ కట్ చేయిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం:నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక అన్న క్యాంటీన్‌లో టీడీ పీ శ్రేణులు చిన్నారులచే కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. అనంతరం అన్నక్యాంటీన్‌లో అన్నదానం చేశారు.

పలమనేరు : నారా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా రిమ్మర్స్ ప్రత్యేక ప్రతిభా వంతుల పాఠశాలలో టీడీపీ, జనసేన శ్రే ణులువిద్యార్థి చేత కేక్ కట్ చేయించారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు.



రిమ్మర్స్ పాఠశాలలో అన్నదానం

సమస్యలకు నిలయంగా పడిగలకుప్పం





తాగునీటి కోసం బిందెలతో మహిళలు అవస్థలు, ఎగువవీధిలో అలంకారప్రాయంగా నీటి ట్యాంకు

వి.కోట, మార్చి 21: కొంగాటం పంచాయతీ పడిగలకుప్పంలో సమస్యలు తిష్ట వేశాయి. సుమారు 400 కుటుంబాలున్న గ్రామంలో పంచాయతీ వారు కనీస మౌళిక వసతులు కల్పించలేదు. తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. గ్రామానికి మూడు బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుం డగా రెండు ఇటీవల బోర్లు ఇంకిపోయాయి. దీంతో చెరువులో ఉన్న ఒక్క బోరు నుంచి మాత్రమే నీరు అందుబాటులో ఉండటంతో మహిళలందరూ ట్యాంకు వద్దకే క్యూకట్టాల్సి వస్తోంది. పల్లెలో అక్కడక్కడా నీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన సిన్‌టెక్స్ ట్యాంకులు అలంకారప్రా యంగా మారాయి. ప్రస్తు తం వస్తున్న నీరు గ్రామానికి సరిపడక పోవడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని మహిళ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలో సరైన మురుగునీటి కాల్వలు లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటూ దుర్గంధ వాతావరణం నెలకొంది. దీనికి తోడు గ్రామం నడిబొడ్డున చెత్తది బ్బలు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. పేరుకు మేజర్ గ్రామ పంచాయతీ అయినా తమ గ్రామ బాగుపై పంచాయతీ దృష్టి సారించలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి పడిగలకుప్పంలో సమస్య లపై దృష్టి సారించి పారిశుధ్యాన్ని మెరగుపరచి, తాగునీటి సమస్య పరిష్కరిం చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం, మార్చి 21: రామకుప్పం మండలం రాజు పేట సమీపంలో గురువారం ఉదయం వాహనాల తని ఖీల్లో భాగంగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చే శామని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. శాంతిపురం మండలం కర్లగట్టకు చెందిన మహేష్ ద్విచ క్ర వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 300 టెట్రాప్యా కెట్ల కర్ణాటక మద్యం, 7బీర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనంచేసుకుని మహే ష్‌ను అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



కల్లూరు, మార్చి 21: పులి చెర్ల మండలం దేవళంపే టలో కొలువైన లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో గురువారం స్వామికి అభిషే కాలు, అర్చనలు, ప్రత్యేకపూ జలు నిర్వహించార స్వామి వారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయదా రులుగా పాళెం కోటపల్లికి చెందిన నరసింహులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

గజ వాహనంపై విహరించిన శ్రీవారు



సోమల, మార్చి 20: ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను గజవాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించి అభిషేక పూజలు జరిపి భక్తు లకు దర్శన భాగ్యం కల్పించారు. అర్చకులు హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కాపు రెడ్ల సంఘం ఉభయదారులు ఉత్సవమూర్తులను పల్లకిలో అలంకరించి ఊరేగించారు. కార్యక్రమామంలో పెద్దఉప్పర పల్లె, పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ల్లోని కాపు రెడ్లు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ర్యాలీ

సోమల, మార్చి 21: మెప్మా ఆధ్వర్యంలో గురువారం నంజంపేటలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. వారపు సంతలో ఓటు హక్కు కరపత్రాలను వెలుగు మహిళలు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. ఏపీఎం శివ మాట్లాడుతూ ఓటుహక్కు ఎంతో పవిత్రమైందని, ఓటు ను తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్ర మంలో సీసీలు గంగోజీ, నరసింహులు, సంఘమిత్రలు అమరావతి, రేణుక, అగస్త్రీ, సంఘమహిళలు పాల్గొన్నారు.

వైసీపీ యూత్ ప్రెసిడెంట్‌గా కుమార్ రాజ

సోమల, మార్చి 21: మండల వైసీపీ యూత్ ప్రెసిడెం ట్‌గా వరదం కుమార్ రాజును నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఆయన మూడో పర్యాయం ఈ పదవికి ఎంపికయ్యారు.

నిర్వాణ నారాయణస్వామికి పూజలు



పలమనేరు, మార్చి21 : పలమనేరు సమీపంలోని విష్ణుపురి ఆలయంలో వెలసిన నిర్వాణ నారాయణ స్వామికి గురువారం మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనం తరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈకా ర్యక్రమంలో ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్ దంపతు లు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

సోమల : మండలంలోని ఆవులపల్లె, మల్లేశ్వరపురం గ్రామాల్లో బుధవారం రాత్రి ఏనుగులు వరి, టమోటా, మామిడి తోటల ను ధ్వంసం చేశా యి. మల్లేశ్వరపురానికి చెందిన జ్యోతి నాయుడు, గంగాధరం నాయుడుల వరి పంటలతోపాటు డ్రిప్ పైపులు, మోటర్లను ధ్వంసం చేసి నట్లు రైతులు వాపోయారు. సుమారు 16 ఏనుగుల గుంపు సంచరించినట్లు రైతులు తెలిపారు.

పీఈఎస్‌లో అరుదైన శస్త్రచికిత్స

కుప్పం, మార్చి 21: కుప్పం పీఈఎస్‌లో కీ హోల్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ ఎస్‌కే.సుబ్రమణ్యం తెలిపారు. ఆయన చెప్పిన వివరాలిలా... మూర్ఛ వ్యాధితో బాధప డుతున్న గుడుపల్లె మండలానికి చందిన జయమ్మ (43)ను ఆమె బంధువులు ఈనెల 13న పీఈఎస్ ఆసుప త్రికి తీసుకొచ్చారు. జయమ్మను వైద్యులు పరీక్షించి మెదడు దగ్గర బంతి సైజు కణితి ఉన్నట్లు గుర్తించి కీ హోల్ శస్త్రచికిత్స నిర్వహించారు. న్యూరో సర్జరీ వైద్యులు డాక్టర్ మయూర్ వినయ్‌కుమార్ కాకా, మత్తు వైద్యులు డాక్టర్ మోహన్. డాక్టర్ పూజ, స్టాఫ్ నర్స్ నీలమ్మ బృందం పర్యవేక్షణలో ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికి త్సను విజయవంతంగా నిర్వహించినట్లు, పేషెంటు జయమ్మ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

నీటి గుంతలో పడి మహిళ మృతి

బైరెడ్డిపల్లె, మార్చి 21: కామినేపల్లె చెరువువద్ద గురువా రం నీటిగుంతలో పడి కొత్తఇండ్లు గ్రామానికి చెందిన ఒంటరి మహిళ శాంతమ్మ(47) మృతి చెందినట్లు స్థాని కులు గుర్తించారు. చెరువులోవున్న నీటిగుంతలో ప్రమాద వశాత్తు పడి మృతి చెందిందా లేదా ఈ సంఘటన ఏవిధంగా జరిగిందనే వివరాలు తెలియడంలేదు. అయితే పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పిల్లలు పుట్టలేదని వివాహిత ఆత్మహత్య



నాగలక్ష్మి (ఫైల్)

ఐరాల, మార్చి 21: పిల్లలు పుట్టలే దని ఓ వివాహిత ఆత్మహత్య చేసు కున్న ఘటన ఐరాల మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఐరాల ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. సోమల మండలం గట్టువారిపల్లెకు చెందిన నాగలక్ష్మి(21)ని ఐరాల మండ లం చుక్కావారిపల్లెకు చెందిన మదన్‌మోహన్ మూడేళ్ల క్రితం వివా హం చేసుకున్నాడు. వీరికి పిల్లలు కలగలేదు. దీనిపై భర్త ఆమెను తరచూ వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన నాగలక్ష్మి గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని చిత్తూరు ప్రభు త్వాస్పత్రికి తరలించారు. తన కుమార్తె నాగలక్ష్మిని అల్లుడు అదనపు కట్నం కోసం వేధించి హత్య చేశాడని మృతురాలి తండ్రి నాగరాజు ఆరోపిస్తున్నారు.

కోట చెరువు కట్ట కబ్జా



కార్వేటినగరం, మార్చి 21: కార్వేటినగరం గ్రామ పంచాయతీ పరిధిలోని కోట చెరువు కట్ట కబ్జాకు గురైంది. కార్వేటినగరం సంస్థానాధీశులు 150 ఏళ్ల క్రితం కోట చెరువు కట్టను నిర్మించారు. చెరువు కట్టను జేసీబీ యంత్రాలతో ఇటీవల కొంతమంది చదును చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట ఎగువ ప్రాంతంలో జేసీబీలతో చదును చేయడం వల్ల వర్షాలు ఎక్కువగా వచ్చినపుడు దిగువ ప్రాంతంలో నీరు నిల్వ ఉండి చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టను నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో చదును చేసిన వారిపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వృషభ వాహనంపై కరకంఠేశ్వరుడు



నగరి, మార్చి 21: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు వృషభ వాహనంపై భక్తులను అలరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, అర్చనలను వేదపండితులు నిర్వహించారు. వాహన సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

వినూత్నంగా టీడీపీ ఇంటింటి ప్రచారం

● ట్రాక్టర్ దున్ని, కూలీలకు పథకాలు వివరించిన మురళీ మోహన్



మహిళా కూలీలతో మాట్లాడుతున్న మురళీ మోహన్

యాదమరి, మార్చి 21: పూతలపట్టు నియోజవర్గ టీడీపీ అభ్యర్థి మురళీ మోహన్ వినూత్నంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మాదిరెడ్డిపల్లె పంచాయతీలో గురువారం విఘ్నేశ్వర ఆలయంలో పూజలు చేసిన ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని ప్రారంభించారు. టీడీపీ ఆరు గ్యారెంటీ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం రామకృష్ణాపురం గ్రామ శివారులో ట్రాక్టర్‌తో దుక్కిదున్ని రైతుకు టీడీపీ అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. పనులు చేస్తున్న మహిళలతో మాట్లాడి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత సిలిండర్లు తదితర పథకాల గురించి వివరించారు. అనంతరం నాలుగు గ్రామాలకు చెందిన 35 మంది స్థానిక నేతలు మురళీమోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం



చిత్తూరు రూరల్, మార్చి 21: నగరంలోని తేనెబండలోని చర్చిలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న లాజరస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. కుటుంబ పోషణకు కూడా కష్టపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు గురువారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. పార్థసారథి నాయుడుకు లాజరస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కరపత్రాల పంపిణీ

విజయపురం, మార్చి 21: మండలంలో బాబు సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీ కార్యక్రమం జోరుగా జరుగుతోంది. గురువారం మండలంలోని శ్రీహరిపురం పంచాయతీలో ఇంటింటా బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కోసలనగరంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కోడూరు మణి కుటుంబాన్ని చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, గుణభూషణమ్మ, చిన్నబ్బరాజు, సురేష్‌రాజు, చెంచురాజు, డీఎస్‌రాజు, ధాము, మునిశేఖరశెట్టి, నాదముని, నాగరాజు, గాలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేద్దాం

గంగాధరనెల్లూరు, మార్చి 21: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేద్దామని జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి ఎస్.హెచ్.నియాజ్‌అలీ తెలిపారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో టీడీపీ నేతలు గురువారం సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇం టింటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు ఫైరోజ్‌అలీ, దిల్లు, ము ర్తుజా, దాసరపల్లె శంకర్, చందా, వెంకటేషలు పాల్గొన్నారు.



తిరుమలలో గురువారం నారా లోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్



టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా ఎన్నికైన సీఆర్ రాజన్‌ను గురువారం తిరుచానూరులోని ఆయన స్వగృహంలో కలసి అభినందనలు తెలుపుతున్న చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత తదితరులు - చిత్తూరు సిటీ

రైలు ఢీకొని యువకుడి మృతి



మృతుడి పర్స్‌లో దొరికిన ఫొటో

చిత్తూరు రూరల్, మార్చి 21: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన చిత్తూరు-పూతలపట్టు రైల్వే స్టేషన్ మధ్య బుధవారం రాత్రి చోటు చేసుకుందని రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆ యువకుడికి సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని, లైట్ గ్రీన్ కలర్ ఫుల్ షర్ట్, మెరూన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఉందని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 94406 27652 నెంబరును సంప్రదించాలని కోరారు.

పిల్లలు పుట్టలేదని వివాహిత ఆత్మహత్య



మృతురాలు నాగలక్ష్మి (ఫైల్ ఫొటో)

ఐరాల, మార్చి 21: పిల్లలు పుట్టలేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐరాల మండలం చుక్కావారిపల్లెలో గురువారం చోటుచేసుకుంది. ఐరాల ఎస్ఐ రమేష్ కథనం మేరకు సోమల మండలం గట్టువారిపల్లెకు చెందిన నాగలక్ష్మి(21)ని ఐరాల మండలం చుక్కావారిపల్లెకు చెందిన మదన్‌మోహన్ మూడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి పిల్లలు కలగలేదు. అయితే దీనిపై భర్త మదన్‌మోహన్ భార్యను తరచూ వేధిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నాగలక్ష్మి గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవ పంచనామా కోసం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి నాగరాజు కథనం మేరకు తన కుమార్తె నాగలక్ష్మిని అల్లుడు అదనపు కట్నం కోసం వేధించి హత్య చేశాడని ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో మృతి చెందిన రామన్

తవణంపల్లె, మార్చి 21: డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు. చిత్తూరు కట్టమంచిలోని కన్నికలమ్మ గుడి సమీపంలో నివాశముంటున్న లేట్ గణేష్ కుమారుడు రామన్(60) తవణంపల్లె మండలంలోని కె.పట్నం సమీపంలో గల నయార పెట్రోల్ బంక్ వద్ద ఎలక్ట్రికల్ వర్క్ షాప్‌లో పని చేస్తున్నాడు. పని నిమిత్తం షాపు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకొని కాణిపాకం వెళుతూ కె.పట్నం సమీపంలో బెంగళూరు - తిరుపతి హైవే పక్కన సర్వీసు రోడ్డులో వేగంగా వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రెణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

నింద్ర, మార్చి 21: పిల్లలు, గర్భిణులు పోషకాహారం కలిగిన కూరగాయాలు, పండ్లను ఆహారంగా తీసుకోవాలని నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కృష్ణవేణి అన్నారు. గురువారం మండలంలోని ఇరుగువాయి పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, అంగన్వాడీ కేంద్రం కార్యకర్తలు షీలా, సులోచన, బుజ్జి, వనిత తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తాపడిన కారు, గాయాలపాలైన ధరణి

బంగారుపాళ్యం, మార్చి 21: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని కాటప్పగారిపల్లె వద్ద గురువారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరులోని రాఘవేంద్ర నగర్‌కు చెందిన నందకుమార్, నిరంజన్, అభిజిత్‌లు కారులో తిరుపతిలో జరిగే ఓ వివాహానికి వెళుతుండగా మార్గమధ్యంలోని కాటప్పగారిపల్లె వద్ద కారు అదుపుతప్పి ముందుగా వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న మల్లేశ్వరం గ్రామానికి చెందిన ధరణి తలకు గాయాలయ్యాయి. కారు సుమారు ఐదు పల్టీలు కొట్టి ఆగింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై క్షుణ్ణంగా తనిఖీలు చేయండి

చిత్తూరు, మార్చి 21: నగర పరిధిలో ఎన్నికల కోడ్ అమలుపై క్షేత్రస్థాయిలో మరోసారి క్షుణ్ణంగా పరిశీలన చేపట్టాలని ఏఆర్వో కమిషనర్ అరుణ ఆదేశించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ఎన్నికల నియమావళి అమలుపై ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, లా అండ్ ఆర్డర్ బృందాలతో ఏఆర్వో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. ఎంతఈ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం



అగస్త్యేశ్వర స్వామి రథోత్సవ సేవలో పాల్గొన్న ఉభయదారులు, ఉత్సవ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 21: నగరంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో పంగుణి మాస బ్రహ్మోత్సవాలు గత 8 రోజులుగా ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి అమ్మవార్లకు ఆలయ అర్చకులు శివాచార్యుల బృందం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి అమ్మవార్ల మూలవర్లను ప్రత్యేకంగా అలంకరించి పుష్ప రథంపై అధిష్ఠింపజేసి వైభవంగా రథోత్సవ సేవ నిర్వహించారు. సాయంత్రం నీవానది తీరంలో స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు శివప్రసాద్, మల్లీ ఆచారి, కాళభైరవ ట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేషన్, చాణక్య రవి, విజయలక్ష్మి బాబు, బద్రినారాయణ, సకల మోహన్‌లతో పాటు పుర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మధ్యాహ్నం ఆది దంపతుల కల్యాణోత్సవం, సాయంత్రం చిత్తూరు జిల్లా బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనసేవ నిర్వహించనున్నారు.

ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 21: తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ కోరారు. గురువారం స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురజాల మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన నియోజకవర్గ ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అయితే నియోజకవరాన్ని అభివృద్ధి చేసే అవకాశం వస్తుందని చెప్పారు. తన గెలుపుకోసం అందరూ సహకరించాలని కోరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర చౌదరి, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, నేతలు అట్లూరి శ్రీనివాసులు, విశ్వనాథ్, వెంకటముని, బ్రహ్మానంద రెడ్డి, మోహన్ నాయుడు, బాబు పాల్గొన్నారు.



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తిరుపతి విమానాశ్రయంలో గురువారం కలిసిన చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని - చిత్తూరు సిటీ

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

పాలసముద్రం, మార్చి 21: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామి సిబ్బంది ఎటువంటి రాజకీయ కార్యకలాపాలలో పాల్గొన్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని గురువారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా దేవాన్ష్ జన్మదిన వేడుకలు



బర్త్‌డే కేక్ కట్‌చేస్తున్న తెలుగు మహిళలు తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 21 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుమారుడు దేవాన్ష్ జన్మదినాన్ని తెలుగుమహిళలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం నగరంలోని బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో దేవాన్ష్‌కు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, తెలుగుమహిళలు దీపశ్రీ, విక్టోరియా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండల కేంద్రమైన గుడిపాలలో ఎన్టీఆర్ ట్రస్టు నిధులతో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి నాయుడు, నాయకులు గుర్రప్ప నాయుడు, గోవిందు గౌడ్, శివలింగా రెడ్డి, ఆనంద్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు మండల టీడీపీ నాయకులు అంబేడ్కర్ సర్కిల్ వద్ద భారీ కేక్ కట్‌చేసి, పేదలకు అన్నదానం చేశారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, హిమగిరి నాయుడు, ఊట్ల నాగరాజ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, రజిని, భార్గవ్, మధు, నాదముని, రామూర్తి నాయుడు, మోహన్, ఏకాంబరం, వీరభద్రయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో అన్నదానం చేస్తున్న జయప్రకాష్

బంగారు పాళ్యం: స్థానిక బీపీఎస్‌కే కాంప్లెక్స్ వద్ద అన్న క్యాంటీన్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు భారీ కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర నాయుడు, కోదండ యాదవ్, కోకా ప్రకాష్ నాయుడు, జనార్ధన్ గౌడ్, వాసుదేవ నాయుడు, వంశీ చౌదరి, సుదర్శన్ నాయుడు, రమేష్, హరిప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి దిలీప్, సునీల్ కుమార్, సప్తగిరి ప్రసాద్, గోపి, ప్రకాష్, వేలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఈసీ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఐరాల(కాణిపాకం), మార్చి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఆర్‌బీహెచ్‌ఎన్ చక్రవర్తి కుటుంబ సమేతంగా గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, డీపీవో లక్ష్మీ, ఐ&పీఆర్ డీడీ పద్మజ, ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సేవల్లో ఇబ్బందులు తొలగించండి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ద్వారా అందిస్తున్న ప్రావిడెంట్ ఫండ్ సేవల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని యూటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.వి. రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మణిగండన్ తదితరులు జిల్లా పరిషత్‌లో సీఈవో గ్లోరియాను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సత్వరమే మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పదవీ విరమణ చేసే రోజుకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు తుది చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ప్రతి నెలా ఉద్యోగి నుంచి వసూలుచేస్తున్న పీఎఫ్ చందా మొత్తాలు ఆన్‌లైన్‌లో కనిపించే రీతిలో మార్పులు చేపట్టాలని కోరారు. సీఈవోను కల్సిన వారిలో రెహనా బేగం, పి. సుధాకర్ రెడ్డి, కె. దీనావతి, ఎస్‌పీ బాషా, ఏకాంబరం తదితరులు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతకు సన్మానం



నగరి, మార్చి 21: నగరి పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థి భానుప్రకాష్ జాతీయ స్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి గోల్డ్‌మెడల్ పొందాడు. బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినందుకు విద్యార్థి భానుప్రకాష్‌ను, కోచ్ గోపీని గురువారం కళాశాల ఆవరణలో అధ్యాపకబృందం శాలువా కప్పి సన్మానించారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పూతలపట్టు, మార్చి 21: ప్రభుత్వ అధికారులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవని పూతలపట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన్నయ్య హెచ్చరించారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులైనా, కిందిస్థాయి సిబ్బంది అయినా కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ వాహనాలపైన రాజకీయ నాయకుల చిత్రపటాలు, వాల్‌పోస్టర్లు అతికించుకోరాదన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలపై ఈసీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

అధికారులకు ఇది కనబడలేదా....?

● మాకో రూలు... వాళ్ళకో రూలా..?

● మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు



వైసీపీ కార్యాలయానికి ఉన్న బ్యానర్లు

గుడిపాల, మార్చి 21: ఎన్నికల కోడ్ వచ్చి ఐదు రోజులు అవుతున్నా అధికారులకు టీడీపీ బ్యానర్లు తొలగించి, వైసీపీ బ్యానర్లు తొలగించకపోవడం ఏమి న్యాయమని, టీడీపీకి ఓ రూలు... వైసీపీకి ఓ రూలా...? అని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రంలో సాక్షాత్తు తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే వైసీపీ కార్యాలయంలో బ్యానర్లు అతికించి వున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు చేయడం గమనార్హమని, వెంటనే బ్యానర్లను తొలగింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోల్‌కు వైసీపీ రంగులు



పూతలపట్టు, మార్చి 21: పూతలపట్టు మండలం పి. కొత్తకోట పంచాయతీ గ్రామ సచివాలయానికి 10 అడుగుల దూరంలో వైసీపీ రంగులతో వున్న పోల్‌కు ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పి.కొత్తకోట ఉన్నత పాఠశాల ప్రహరీగోడ సమీపాన వైఎస్సార్ విగ్రహంతో పాటు వైసీపీ జెండాను నాయకులు ఏర్పాటు చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ విగ్రహానికి పంచాయతీ అధికారులు ముసుగువేశారు. కానీ ఆ పక్కనే ఉన్న వైసీపీ రంగులు వున్న పోల్‌కు తెల్ల రంగు వేయడం మరిచారు.

కొల్లాగుంట చెక్‌పోస్ట్‌లో పోలీసుల తనిఖీ

కార్వేటినగరం మార్చి 21: కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్ పోస్ట్ వద్ద తమిళనాడు నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన కొల్లాగుంట వద్ద జిల్లా పోలీస్ యంత్రాంగం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్ట్ ప్రాంతం తమిళనాడు రాష్ట్రానికి చెందిన తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలుకా ప్రాంతానికి అనుకుని ఉన్నది. దీంతో పక్కరాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



నింద్ర, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎంపీడీవో భవాని, ఎస్ఐ రామచంద్ర గురువారం నింద్రలో వాహనాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం మాత్రమే వాహనాల్లో నగదు తీసువెళ్లాలని, అంతకు మించి ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళితే సీజ్ చేస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి భానుప్రకాష్ పరామర్శ



నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

నగరి, మార్చి 21: నగరి పట్టణ పరిధిలోని సత్రవాడకు చెందిన నాగరాజు కుమారుడు గోపీకృష్ణ మృతదేహానికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. గోపీకృష్ణ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. చిత్తూరు పార్లమెంటరీ అధికారప్రతినిధి చినబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ వ్యవస్థాపకుడి వర్ధంతి



వెంకటస్వామి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల, మార్చి 21: యూటీఎఫ్ వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఐరాల ప్రాథమిక పాఠశాలలో ఆ ఫెడరేషన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఏకాంబరం, సురేష్‌బాబు, అరుణ్‌కుమార్, సరోజమ్మ, వాణి, సుధాకర్, సుబ్రహ్మణ్యం, అమ్ములు, త్రివేణి, గుణసుందరి, రామచంద్ర నాయుడు, ఉషారాణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.